తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
సోమవారం
09 మార్చి 2026
పేజీలు : 12
Follow :

# ఆసుపత్రి నిర్మాణం వేగంగా నిర్మించాలి

## 150 పడకల ఆసుపత్రిని సందర్శించిన మంత్రి వాకిటి

మక్తల్, మార్చి 08 (జనంసాక్షి)
మక్తల్ పట్టణంలో కొనసాగుతున్న 150 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులను రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి పరిశీలించారు. ఇక్కడ జరుగుతున్న పనులు ఇంకా చేపట్టాల్సిన పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిరుపేద ప్రజల సంక్షేమం కోసం ఏర్పడుతున్న ఈ ఆసుపత్రి నిర్మాణం పనులు మరింత వేగవంతంగా చేప్పటాల్సిందిగా ఆయన సూచించారు. పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడేది లేదన్నారు. నాణ్యతగా పనులను పూర్తి చేయాలని మంత్రి ఈ సందర్భంగా అధికారులు కాంట్రాక్టర్ ను ఆదేశించారు. మక్తల్ పట్టణంలో నిర్మించనున్న 150 పడకల ఆస్పత్రి పనులను నవంబర్ లోగ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 167వ జాతీయ రహదారి నుంచి ఆసుపత్రికి వచ్చే రహదారి సంబంధించిన స్థలాన్ని కూడా మంత్రి శ్రీహరి పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే



ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండకుండా విశాలమైన రోడ్డు ఉండాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం స్థానికంగానే అందుతుందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్థానికంగానే అన్ని రకాల వైద్య సేవలు అందించడం లక్ష్యంగా 150 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ఆస్పత్రి నిర్మాణ పనులు దాదాపుగా చివరి దశకు చేరుకున్నాయని మిగతా పనులన్నీ మిగతా3లో

# ఉదండాపూర్ నిర్వాసితులకు రూ. 338 కోట్ల పరిహారం

- పెంచిన మొత్తాలతో చెల్లింపునకు ప్రభుత్వం అంగీకారం
- 2 నెలల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ప్లాట్లు కూడా రిజిస్టర్ చేసి ఇవ్వాలన్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

జడ్చర్ల, మార్చి 8 (జనంసాక్షి): ఉదండాపూర్ ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ కింద పెంచిన మొత్తాలతో కలిపి రూ. 338 కోట్లను చెల్లించడానికి ప్రభుత్వం అంగీకరించిందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తెలిపారు. ఈ మొత్తాన్ని రెండు నెలల్లో నిర్వాసితులకు అందజేస్తామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారని వెల్లడించారు. దీనితో పాటుగా మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఇచ్చిన తరహాలోనే ఉదండాపూర్ నిర్వాసితులకు కూడా ప్లాట్లు రిజిస్టర్ చేసి ఇవ్వాలని కోరామని చెప్పారు. హైదరాబాద్ లోని జలసౌద లో ఆదివారం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పై జరిగిన అధికారిక సమీక్షా సమావేశం లో ఈ విషయాలపై చర్చించడం జరిగిందని అనిరుధ్ రెడ్డి వివరించారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో భాగంగా ఉదండాపూర్ నిర్వాసితులకు ఇచ్చే పరిహారాన్ని రూ.18 లక్షలకు పెంచడం, ఈ కారణంగా నిర్వాసితులకు అదనంగా రూ.146 కోట్ల రూపాయల మొత్తాన్ని చెల్లించడానికి ప్రభుత్వం గతంలోనే అంగీకరించిందని గుర్తు చేశారు. అలాగే గతంలో మల్లన్నసాగర్ ప్రాజెక్ట్



నిర్వాసితులకు జివో నంబర్.1 ద్వారా వారికి కేటాయించిన ప్లాట్లను రిజిస్టర్ చేసి ఇవ్వడం జరిగిందని అదే విధంగా ఉదండాపూర్ నిర్వాసితులకు ఇస్తున్న ప్లాట్లను కూడా రిజిస్టర్ చేసి ఇవ్వాలని కోరామని తెలిపారు. ఈ విషయం గురించి ఇదివరకే జిల్లా కలెక్టర్ తో కూడా మాట్లాడానని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉదండాపూర్ నిర్వాసితులకు న్యాయం చేయకపోగా భూములు లేని వారికి కూడా దొంగ డాక్యుమెంట్లు సృష్టించి పరిహారాలు ఇచ్చారని, లేని వారికి కూడా ఇళ్లు ఉన్నాయని రికార్డులు క్రియేట్ చేసి వారికి కూడా పరిహారం చెల్లించాలని జాబితాలు తయారు చేశారని విమర్శించారు. ప్రస్తుతం తాము రీ సర్వే చేయించి మిగతా2లో

# ఘనంగా దుర్గమ్మ పోచమ్మ జాతర



టేక్మాల్, మార్చి 8 (జనం సాక్షి)
టేక్మాల్ మండల కేంద్రంలోని దుర్గమ్మ, పోచమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభ మయ్యాయి. ప్రతి సంవత్సం హోళీ పండుగ తర్వాత ఐదవ రోజు నుంచి ఐదు రోజుల పాటు జాతరను జరిపించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా ఆదివారం అమ్మవార్లకు బోనాలు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలను తీశాను. భక్తిశ్రద్దలతో మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకుని ఊరేగింపుగా దుర్గమ్మ, పోచమ్మ ఆలయానికి తీసుకువచ్చారు. డప్పు చప్పుళ్లు, పోతురాజు విన్యాసాలతో ఉత్సాహంగా ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి బోనాలను అమ్మవార్లకు సమర్పించారు. జాతర సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు గ్రామ సర్పంచ్ తిమ్మి గారి  సుధాకర్ అవసరమైన అన్ని ఏర్పాట్లను  చేశారు. రంగు రంగుల విద్యుత్తు దీపాలతో ఆలయాన్ని అందంగా ముస్తాము చేశారు.



# బాలికలకు వ్యాక్సిన్ తప్పనిసరి

## జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

సంగారెడ్డి, మార్చి 08 (జనం సాక్షి)
ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో పెద్ద ఆరోగ్య సమస్యగా ఉన్న సర్వైకల్ క్యాన్సర్ నివారణకు హెచ్‌పివి వ్యాక్సిన్ ఎంతో ఉపయోగ పడుతు ందని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. ఆదివారం సంగారెడ్డి జనరల్ ఆసుపత్రిలో హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని 15 సంవత్సరాల లోపు బాలికలకు మిగతా5లో

# మహిళలు అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవడం గర్వకారణం

## జడ్చర్ల 2కే రన్‌లో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి




జడ్చర్ల, మార్చి 8 (జనంసాక్షి): మహిళలు ఎన్నో కష్టాలను అధిగమించి నేడు అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవడం గర్వకారణమని మాజీ మంత్రి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సి. లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ప్రియదర్శిని వుమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా 2కే రన్ కార్యక్రమాన్ని మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ నుండి ప్రారంభమైన ఈ పరుగు డాక్టర్ బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు అత్యంత ఉత్సాహంగా సాగింది. మాజీ మంత్రి స్వయంగా మహిళలతో కలిసి రన్ కార్యక్రమంలో పాల్గొని వారిలో స్ఫూర్తిని నింపారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు, యువతులతో జడ్చర్ల పురవీధులు మిగతా2లో



# గ్రామ పంచాయతీ రికార్డులను అదనపు కలెక్టర్ పరిశీలన

కోహెడ మార్చి 08:( జనంసాక్షి ):

మండలంలోని బస్వాపూర్ గ్రామములో శనివారం జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండలంలోని బస్వాపూర్ గ్రామ పంచాయతీని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ జిల్లా పంచాయతీ అధికారి రవీందర్ సందర్శించారు. గ్రామ పంచాయతీలోని రికార్డులను, కార్యకలాపాలను పరిశీలించారు. ఇట్టి కార్యక్రమంలో ఆయన వెంట ఎంపిడిఓ కృష్ణయ్య, ఎంపీఓ రవీందర్ రెడ్డి , సర్పంచ్ లింగం , ఉపసర్పంచ్ ప్రవీణ్ , కార్యదర్శి రేఖరాణి పాలకవర్గం తదితరులున్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవడం గర్వకారణం




కిక్కిరిసిపోయాయి. ఈ సందర్బంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మహిళా లోకానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు తమ కుటుంబ బాధ్యతలతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ముఖ్యంగా ప్రతి ఏటా విధిగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని, ఏదైనా వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నయం చేసే అవకాశం ఎక్కువగా ఉంటుందని గుర్తుచేశారు. మహిళల సంక్షేమం కోసం శ్వేత ఫౌండేషన్ ద్వారా త్వరలోనే ఉచిత క్యాన్సర్ పరీక్షల కార్యక్రమాన్ని చేపడతామని, అందుకు అవసరమైన కార్యాచరణను త్వరలోనే ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో ప్రియదర్శిని వుమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# ఉదండాపూర్ నిర్వాసితులకు రూ. 338 కోట్ల పరిహారం

అర్హులను గుర్తించడం జరిగిందని అన్నారు. అలాగే భూములు లేకుండానే దొంగ డాక్యుమెంట్లు సృష్టించి పరిహారాలు కొట్టేసిన వారి నుంచి రికవరికి ఆర్ఆర్ చట్టం కింద నోటీసులు కూడా జారీ చేయించడం జరిగిందని, ఇళ్లు లేకుండానే జాబితా లో ఉన్న అనర్హుల పేర్లను తొలగించడం




కూడా జరిగిందని, ఉదండాపూర్ నిర్వాసితులలో కొంత మంది కోర్టుకు వెళ్ళడం జరిగిందని వారితో కూడా మాట్లాడి వారికి రావాల్సిన పరిహారాన్ని కూడా అందరితో పాటు ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఉదండాపూర్ ప్రాజెక్ట్ పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని విజ్ఞప్తి చేశారు.

# పరీక్షా సమయం.. ప్రణాళికతో విజయం.. !

- 10 గ్రేడ్ పాయింట్లే లక్ష్యంగా ప్రణాళికలు
- వెనుకబడి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- 'టెన్'షన్' లేని ఫలితాలకోసం...కసరత్తు
- చిత్తశుద్ధితో పనిచేస్తున్న ఉపాధ్యాయులు




సంగారెడ్డి ప్రతినిధి, మార్చు 08 (జనం సాక్షి) పదవ తగతి పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్నాయి. ఈసారి ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులతో కలిసి ప్రణాళికలు రూపొందించారు. రోజూ ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు విద్యార్థుల సామర్థ్యాలను బట్టి గ్రూపులుగా విభజిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. వంద శాతం ఉత్తీర్ణత, పదికి పది పాయింట్లు సాధన కోసం తీవ్ర కసరత్తే చేస్తున్నారు. పరీక్షా కాలంలో ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళితే విజయం తథ్యం అంటున్నారు ఉపాధ్యాయులు. సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి టార్గెట్ 10/10, 'పది'లమైన దృష్టి సారించారు. ఇంగ్లీష్, తెలుగు మీడియాలలో 100 శాతం ఉత్తీర్ణతతో పాటు జిల్లా రాష్ట్రస్థాయిలో ర్యాంకులు వచ్చే విధంగా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఆకాంక్ష ఉపాధ్యాయుల కోరిక కూడా ఇదే. మరి ఇదెలా సాధ్యం. ఇందుకు సాధన, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శనం కీలకం. పాఠ్యాంశాలను క్షుణ్ణంగా చదివి లోతుగా అవగాహన చేసుకోవాలి. లఘు, అతి లఘు, వ్యాస రూప ప్రశ్నలకు అనుగుణంగా స్పష్టమైన సమాధానాలు రాస్తే పదికి పది ఖాయం. ఇందుకు సాధనే కీలకం. పదవ తరగతి పరీక్షలపై పోతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల, విద్యార్థుల అభిప్రాయాలు..

## మెరుగైన ఫలితాలు సాధిస్తాం..

**- ప్రధానోపాధ్యాయుడు, విద్యాసాగర్.**



పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితా లు సాధిం చేలా బోధన సాగిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలు, సూచనలు మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో కార్పోరేట్‌కు దీటుగా బోధన సాగుతోంది. చదు వులో వెనుకబడిన విద్యార్థులతో పాటు చదువులో ముందుండే విద్యార్థులపైన కూడా మరింత దృష్టిసారించి శతశాతం ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో ప్రణాళికా బద్ధంగా బోధన సాగిస్తున్నాం.

## గణిత సాధనలో 10/10 సాధ్యం..

**- ఉపాధ్యాయులు శ్రీనివాస్.**



గణితం విషయంలో విద్యార్థులు భయాందోళన చెంద వద్దు. సిద్ధాంతాలు, ఫార్ములాలపై పట్టు సాధించాలి. పేపరు-1లో ముఖ్యంగా సంఖ్యా శాస్త్రం, నిరూపక రేఖా గణితం సాధన చేయాలి. తెలిసిన ప్రశ్నలకు ముందుగా సమాధానం రాయాలి. ఆ తరువాత తెలియని వాటికి సమయం కేటాయించాలి.

## విశ్లేషణాత్మకంగా రాయాలి

**- ఉపాధ్యాయురాలు జ్యోతిర్మయి.**



తెలుగులో చక్కని చేతిరాత, వ్యాకరణంపై పట్టు సాధిస్తే మంచి మార్కులు వస్తాయి. పేపర్-2లో లేఖలు, వ్యాసాలు ఉంటాయి. ఇందులో సమ కాలీన అంశాలపై ఎక్కువగా అడిగే అవకాశం ఉంది. భాషా దోషాలు, కొట్టివేతలు లేకుండా జవాబులు రాయాలి. పేపర్-2లో ఉపవాచకంపై కూడా పట్టు సాధించాలి. మార్కులు బాగా వచ్చే వ్యాసం, కరపత్రం, సన్నివేశ వర్ణణ రాసే విధా నంతో పాటు సూక్తులు, నినాదాలు ఉపయోగిస్తే మరిన్ని ఎక్కువ మార్కులు పొందే అవకాశం ఉంటుంది. ప్రశ్నపత్రాన్ని బాగా చదివి, బాగా వచ్చిన ప్రతీ పదార్థాన్ని మాత్రమే ఎంచుకోవాలి.

## ఆంగ్లంలో స్పెల్లింగ్ పరిజ్ఞానం పెంచుకోవాలి

**- ఉపాధ్యాయురాలు హేమలత.**



ఆంగ్లంలో పేపరు-1, 2 రెండింటిలో పేరాల కింద వచ్చే ప్రశ్నలకు 30 మార్కులు ఉన్నాయి. సృజనాత్మకతకు 15 మార్కులు, వ్యాకరణాంశాల (గ్రామర్)కు 20, రెండో పేపర్లో పదజాలం ఉంటాయి. పేపర్- 2లో సృజనాత్మకత కింద ఉత్తరం లేదా సందర్భాన్నిచ్చి వార్తగా, మాటలు ఉపయోగించి పేరా, చిత్రాన్నిచ్చి పేరా రాయడం వంటి అంశాలపై అభ్యసన చేయాలి.

## మంచి మార్కులు సాధిస్తా..

**- విద్యార్థిని, హారిక.**



పాఠ్యాంశాల బోధన పూర్తికావడం, ప్రత్యేక తరగ తులు నిర్వహించడంతో పరీక్షలపై అవగాహన ఏర్పడింది. మంచి మార్కులు సాధిస్తామనే నమ్మకం ఉంది. వచ్చే వార్షిక పరీక్షల్లో పదికి పది గ్రేడ్ పాయింట్స్ సాధించేందుకు పట్టుదలతో కృషి చేస్తున్నాం.

## ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు

**- శాలిని, విద్యార్థిని.**



ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. వారి సలహాలు, సూచన లతో పరీక్షల్లో మంచి మార్పులు సాధించేలా కృషి చేస్తున్నాం. రోజూ పరీక్షలు నిర్వహించి సందే హాలను నివృత్తి చేస్తున్నారు.

## సందేహాలు నివృత్తి

**- విద్యార్థిని, లావణ్య.**



వార్షిక పరీక్షలు దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యా యుల సూచనతో బాగా చదువుతున్నా. మంచి మార్కులు సాధించేందుకు ఎంతో కష్టపడుతున్నా. ఉపాధ్యా యులు ప్రతిరోజూ పరీక్షలు నిర్వహించి ప్రోత్స హిస్తున్నారు.

## ప్రైవేటు పాఠశాలలకు దీటుగా..

**- విద్యార్థిని అర్చన.**



ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన సాగించడంతోపాటు, మరింత చైతన్యవంతమ య్యేలా ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తున్నారు. క్విజ్‌లు, వ్యాసరచన పోటీలు, వకృత్వ పోటీలు వంటి వాటిని పరీక్షలకు అనుగుణంగా నిర్వహిస్తూ ఆసక్తిని పెంపొందిస్తున్నారు.

# అతివల్లో చైతన్యం..ఆకాశమంత..!

- ఓటర్లుగా తీర్పులోనూ కీలకం
- స్థానిక సమరంలో ప్రథమ తాంబూలం
- మున్సిపోల్స్ లోనూ వారే అధికం
- జిల్లాలో ఘనంగా మహిళా దినోత్సవం

సంగారెడ్డి ప్రతినిధి, మార్చు 08(జనం సాక్షి ) ఉద్యోగం పురుష లక్షణం అనే నానుడికి ఎప్పుడో కాలం చెల్లింది. కళాశాల మెట్లెక్కడా నికి భయపడే రోజుల నుంచి కళాశాలలను నడిపే రోజులకు కాలం గిర్రున తిరిగింది. ప్రస్తుత కంప్యూటర్ యుగంలో మహిళలు అన్నింటా ముందున్నారు. ఆకాశమే హద్దు గా అవకాశాలు సృష్టించుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఇటు విద్యా, ఉద్యోగాల్లో.. అటు కుటుంబ బాధ్యతల్లో తమదైన పాత్ర పోషిస్తున్నారు. ఉన్నతస్థాయికి చేర డమే లక్ష్యంగా పెద్ద పెద్ద చదువులూ చదువుతున్నారు.

**యత్ర నార్యంతు పూజ్యంతే..**
**తత్ర దేవతా రమయంతే..**

ఎక్కడ మహిళలు పూజింపబడతారో అక్కడ దేవతలు ఉంటారనేది పూర్వికులు చెప్పిన మాట. ఆ ప్రకారమే నేటి ఆధునిక సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు.. తమదైన శైలిలో ప్రతిభా పాటవాలు ప్రదర్శిస్తున్నారు..! అయినా మహిళలనే చులకన భావం పలు రంగాల్లో వెంటాడుతోంది.. అంతేగాకుండా మహిళలకు రక్షణ కరువవుతోంది. పలు వేధింపులకు గురవుతూ ఇబ్బందులు పడుతున్నారు. ఆడపిల్ల అనగానే పురిటిలోనే నలిపేస్తున్న వారు కూడా నేడు కనిపిస్తున్నారు. ముక్కుపచ్చలారని చిన్నారులకు మూడుముళ్లు వేసి వారి జీవితాలను బందీ చేస్తున్నారు. అదృశ్యమైపోతున్న మహిళలు ఒక వైపు, అక్రమ రవాణాకు గురై నరకం అను భవిస్తున్న వారు మరో వైపు ఉంటున్నారు. మహిళల రక్షణకు 'నిర్భయ చట్టాలు తీసుకువ స్తున్నా వారిపై దాడులు, లైంగిక వేధింపులు ఆగడం లేదు. అత్తింటిలో వేధింపుల కారణంగా బలవుతున్న మహిళలు.. అను మానాలతో కట్టుకున్న భార్యలనే కడ తేరుస్తున్న వారు సమాజంలో ఉన్నారు.

**అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు మహిళల మనోగతం...**

రాజకీయ రంగాల్లో రాణిస్తోన్న జిల్లాలోని వనితలు.. సర్వ జగత్తుకు మూలం.. సహనం, ఓర్పుకు నిదర్శనం మహిళ.. మానవగమనంలో ప్రతి దశలో మహిళ పాత్ర అనివార్యం, అనిర్వచనీయం. వంటింట్లో నుంచి మహిళ చైతన్యవంతు రాలైంది. అన్నిరంగాల్లో రాణిస్తూ తాము సాధించలేనిది లేదని నిరూ పిస్తున్నారు. ఎందరో మహిళలు సంఘటితమై స్వయంశక్తితో వ్యాపా రాభివృద్ధి సాధిస్తూ తమ కుటుంబాల్లో వెలుగులు నింపడమేగాకుండా అభాగ్యులకు సహాయాన్ని అందిస్తున్నారు. మరికొందరు మహిళలు తమదైన రీతిలో సేవలందిస్తున్నారు.

**మహిళల ప్రాతినిధ్యం పెరగాలి..**
**- మున్సిపల్ చైర్మన్ అంజమ్మ.**



చట్ట సభలతోపాటు వివిధ రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం మరింత పెరగాలి. వారికి అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఇంకా వివక్ష కొనసాగుతోంది. ఉన్నత విద్యా ప్రమాణాలు ఉన్నా సమాజంలో తగిన స్థాయిలో గుర్తింపు అభించడం లేదు. ప్రాథమిక విద్యలో బాలికల ప్రవేశాలు అధికంగా ఉన్నప్పటికీ ఉన్నత విద్యలో వారి సంఖ్య తగ్గిపోతోంది. చట్టాలు, హక్కులపై మహిళలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. మహి ళలకు స్వప్రయోజాలు కుటుంబ వ్యవస్థపై ఉన్న అవగాహన తమ హక్కులు, చట్టాలపై ఉండడం లేదు. స్వయం ప్రతిపత్తిలో స్వతహాగా రాణించే స్థాయికి ఎదగాలి. బాలి కల డ్రాపౌట్స్ శాతాన్ని తగ్గించి వారికి ఉన్నత విద్యను అందించాలి.

**అక్షరంతోనే మహిళల అభివృద్ధి..**
**- మున్సిపల్ వైస్ చైర్మన్ రేణుక.**



మహిళలు కచ్చితంగా చదువుకో వాలి. మనకెందుకు చదువు అన్న భావన ఉండకూడదు. అరకొర చదు వుల వల్ల ఏ రంగంలోనూ నిలబడ లేరు. ఉన్నత చదువులే లక్ష్యంగా సాధన చేయాలి. దీనివల్ల కుటుం బాన్ని, తరువాత సమాజాన్ని తీర్చి దిద్దే అవకాశం లభిస్తుంది.

**తొలి ప్రయత్నంలోనే విజయం..**
**- 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత.**



కౌన్సిలర్ గా తొలి ప్రయత్నమే అయినా విజయం సాధించాను. అందరి సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాను. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ వార్డులోని సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తా.

**మహిళలపై గౌరవం పెరిగేలా..**
**- 19వ వార్డు కౌన్సిలర్ పట్లూరి రోజా.**



మహిళలను చేతులతో గౌరవించి నోటితో తూలనాడే సంస్కృతి పోవాలి. ఓ మహిళ ఏంచేస్తుందని కాదు ఏదైనా సాధించగలదని నిరూపించాలి. సామాన్య కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వస్తాయని నేననుకోలేదు. కానీ వచ్చిన అవకాశాన్ని వదులుకోలేదు. అందరూ అలాగే ఉపయోగించుకోవాలి.

**వార్డు అభివృద్ధికి కృషి చేస్తా...**
**- 22వ వార్డు కౌన్సిలర్ గారెల గౌరీదేవి.**



పరిపాలన కేవలం మగవారికే సాధ్యం అనేది తప్పని మహిళలు ఎప్పుడో నిరూపించారు. గతం తో పోలిస్తే ప్రజాప్రతినిధులుగా ఎన్నికవు తున్న మహిళల్లో చాలా మార్పు వచ్చింది. భర్తలచాటు భార్యల్లా కాకుండా పరిపాలనలో స్వయంగా నిర్ణ యాలు తీసుకుంటున్నారు. సభలు, సమావేశాల్లో ఎటువంటి బిడియం లేకుండా ధైర్యంగా, చక్కగా మాట్లాడుతున్నారు.

**ఆత్మస్థైర్యంతో విజయం..**
**- మునిపల్లి సర్పంచ్ సౌందర్య.**



నేటి కాలంలో మహిళలు అన్నింటా దూసుకుపోతున్నారు. స్వతంత్రంగా ఆలోచించి ముందడుగు వేస్తున్నారు. ఎంచుకున్న రంగం తమదైన శైలిలో సాగుతున్నారు. మహిళలు ఆత్మస్థైర్యంతో ఉన్న ప్పుడే మరింత శక్తివంతులుగా మారతారు. వారికి అదే విజయాన్ని తెచ్చిపెడుతోంది. మహిళ లందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

**ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారు..**
**- చిన్న చెల్మెడ సర్పంచ్ రుద్ర గాయత్రి.**



మహిళలను ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారు. ఎంతో ప్రతిభ ఉన్న మహిళలు ప్రోత్సహం లేక వెనక బడి పోతున్నారు. ప్రభుత్వాలు ఇప్పుడిప్పుడే మహిళల సంక్షేమంపై దృష్టి సారిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో అండగా నిలుస్తోంది. ముఖ్యంగా మహిళలు చదువుపై దృష్టి సారించాలి. ఆత్మగౌరవంతో సమాజంలో నిలబడాలి. పురుషాధి కృత సమాజంలో మహిళలకు కాసింత ప్రోత్సాహం అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారు.



## తడి పొడి చెత్తపై అవగాహన

- సర్పంచ్ దివ్య శ్రీహరి

తూప్రాన్ మార్చి 8 (జనం సాక్షి): తడి చెత్త పొడి చెత్త ను మీ ఇంటికి వచ్చే చెత్త వాహనాల లో వేరువేరుగా వేయాలని చెట్ల గౌరారం సర్పంచ్ చింతల దివ్య శ్రీహరి తెలిపారు గ్రామంలోని తడి పొడి చెత్త గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు వీధులలో ఆమె పర్యటించారు. ఇంటింటికి వెళుతూ తడి పొడి చెత్త పై మహిళలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించాలని పరిశుభ్రత పాటిస్తే ఎలాంటి వ్యాధులు రావని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవీందర్ గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి నిర్మాణం వేగంగా నిర్మించాలి



కూడా వేగవంతం చేయాలని ఆయన సూచించారు. జాతీయ రహదారికి అతి చెరువులో ఉండడం వల్ల ప్రజలకు రవాణా సౌకర్యం ఇబ్బందులు లేకుండా విశాలమైన రోడ్డు ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా మక్తల్ అనుగొండ రోడ్డు నుండి కూడా ఆసుపత్రికి రోడ్డు మార్గం కల్పిస్తామని చెప్పారు. నలుదిక్కుల నుండి రోడ్డు సదుపాయం కల్పించడం కోసం కృషి చేస్తామన్నారు. నవంబర్ నాటికి నిర్మాణ పనులను పూర్తిచేస్తే డిసెంబర్లో ఆసుపత్రిని ప్రారంభించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు.ఆసుపత్రి నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని మంత్రి సూచించారు. మంత్రి శ్రీహరి వెంబడి కాంగ్రెస్ నాయకులు కట్టా సురేష్ కుమార్ గుప్తా, బోయ రవికుమార్, వాకిటి హన్మంతు, కావాలి తాయప్ప, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## చాకరిమెట్లలో అదనపు ఎస్పీ పూజలు

శివ్వంపేట మార్చి 8 జనంసాక్షి: శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్ల అటవీ ప్రాంతంలో ఆధ్యాత్మికంగా ఉమ్మడి జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన స్వయంభూగా వెలసిన చాకరిమెట్ల సహకార ఆంజనేయ స్వామి వారిని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ ఆదివారం శివ్వంపేట ఎస్ఐ మధుకర్ రెడ్డి తో కలిసి దేవాలయంలో ఆంజనేయస్వామి వారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి అర్చన, అభిషేకం, మన్నె సూక్త పారాయణం, బిల్వార్చన, ఆకు పూజలు చేపట్టారు. అక్కడి నుంచి రామాలయంలో సీత సమేత రామచంద్రుడిని, వ్రత మండపం కొలువైన దేవతామూర్తులను కూడా దర్శించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలు హాజరై దేవాలయంలో స్వామివారిని దర్శించుకుని దంపతుల వారీగా పెద్ద సంఖ్యలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. పూజలు ముగిసిన తర్వాత జిల్లా అదనపు ఎస్ పీ మహేందర్, స్థానిక ఎస్ఐ లను స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన పూజారి శాస్త్రుల దేవదత్తు శర్మ, శ్రీ చరణ్ శర్మ, సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో ఉన్నారు.



## మల్కాపూర్‌లో 391 స్వచ్ఛభారత్

తూప్రాన్ మార్చ్ 8( జనం సాక్షి): తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో 391వ వారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ యువత ఆధ్వర్యంలో 391 స్వచ్ఛభారత్ నిర్వహించారు. సీసీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించడంతోపాటు, పరిసరాలను చీపుర్లతో ఊడ్చి శుభ్రపరిచారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మూడవరోజు గ్రామంలో తడి పొడి చెత్త పై మహిళా సంఘాలకు పాలకవర్గ సభ్యులతో కలిసి సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ అవగాహన కల్పించారు.





అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని గ్రామంలోని మహిళా సమైక్య సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ స్వామి, వార్డు సభ్యులు పిట్ల వేణు, జిన్న కృష్ణ, మన్నె తిరుపతి, సరిత పరమేష్ గౌడ్ , రేఖ నాగరాజ్ గౌడ్ ,మాధవి స్వామి,మాజీ సర్పంచ్ నరసింహులు,ఫీల్డ్ అసిస్టెంట్ మేకిన్ యువత,పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వీరభద్ర స్వామి జయంతి వేడుకల్లో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్

సదాశివపేట మార్చి 8 (జనం సాక్షి)
ఈశ్వర మార్కండేయ మందిరంలో ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు గుజ్జరి వెంకన్న , ఆలయ కమిటీ సభ్యులు వీరభద్ర స్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వీరభద్ర స్వామి జయంతి పురస్కరించుకుని ఆలయంలో ఉదయం 8 గంటలకు అభిషేకం,9 గంటలకు గణపతి హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మున్సిపల్ చైర్పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్ పర్సన్ రేణుక చిరంజీవి,మున్సిపల్ కౌన్సిలర్ లు పులిమామిడి మమత, అరుణ్ కుమార్, బిట్ల నికిత ప్రేమ్,నర్సింలు, పాత దొడ్డి అనిత విష్ణువర్ధన్ రెడ్డి లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ



ఆధ్వర్యంలో చైర్మన్ ,వైస్ చైర్మన్ , మున్సిపల్ కౌన్సిలర్లకు సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే పేదల సొంతింటి కల సహకారం

**మున్సిపల్ చైర్పర్సన్ మునిపల్లి అంజమ్మ**

సదాశివపేట మార్చి 8 (జనం సాక్షి)
పేదల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ అన్నారు. ఆదివారం సదాశివపేట పట్టణంలోని 19 వ వార్డులో పూర్తయిన ఇందిరమ్మ ఇంటి గృహ



ప్రవేశ కార్యక్రమానికి హాజరై మున్సిపల్ వైస్ చైర్పర్సన్ రేణుక చిరంజీవి, స్థానిక వార్డు కౌన్సిలర్ పట్లూరి రోజా నాగరాజ్ గౌడ్, లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పట్టణ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. అనంతరం లబ్ధిదారులు సంగారెడ్డి పేట గంగమ్మ మాట్లాడుతూ తమకు జీవితంలో సొంత ఇంటి నిర్మాణం చేసుకుంటామని ఆశ కూడా లేకుండా అని, కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో తమ కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి లకు జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ లు శంకర్ గౌడ్, పాత దొడ్డి అనిత విష్ణువర్ధన్ రెడ్డి, షాజీ,భారత్,నాయకులు కోదూరి శరత్,కార్యకర్తలు పాల్గొన్నారు.

# సికింద్లాపూర్ లక్ష్మీ నృసింహుడీ క్షేత్రంలో భక్తుల పూజలు



శివ్వంపేట మార్చి 8 జనంసాక్షి: మండల పరిధిలోని సికింద్లాపూర్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతం కొండల మధ్య స్వయంభూగా వెలిసిన శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారి జాతర బ్రహ్మోత్సవాలల్లో భాగంగా తొమ్మిదవ వారమైన ఆదివారం ఉమ్మడి జిల్లాలోని ప్రాంతాలతో పాటు జంట నగరాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దేవాలయంలో స్వామివారి దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సమేతంగా దేవాలయాన్ని గదిలో చిన్న భక్తులు ఆలయ పరిసరా ప్రాంతాలలో వంట మార్పు చేపట్టి సామూహిక వన భోజనాలు చేశారు. క్రింది దేవాలయంలో వద్ద కూడా ఎవరికీ ఎటువంటి అసౌకర్యాలు కలగ కుండా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమం లో ఆలయ కార్యనిర్వాహణ అధికారి శశిధర్, ఆలయ ప్రధాన పూజారి ధనుంజయశర్మ, అర్చకులు విద్యాకర్ చారి, జూనియర్ అసిస్టెంట్ నర్సింహారెడ్డి, పూజారుల బృందం, సిబ్బంది, భక్తులు పెద్దసంఖ్యలో ఉన్నారు.



# బాలికలకు వ్యాక్సిన్ తప్పనిసరి

జనరల్ ఆసుపత్రి , ఏరియా ఆసుపత్రుల్లో హెచ్‌పివి వ్యాక్సిన్‌ను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 14 నుండి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల సుమారు 12,500 మంది బాలికలను వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గుర్తించినట్లు తెలిపారు. ఈ బాలికలందరికీ ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక, 99 రోజుల కార్యక్రమం కాలంలో ఉచితంగా వ్యాక్సినేషన్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. బాలికల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రుల సమక్షంలోనే ఈ వ్యాక్సిన్ అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. క్యాన్సర్ రహిత సమాజ నిర్మాణం కోసం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేపడుతున్న ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా వసంతరావు ,వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో కౌన్సిలర్ పులి మామిడి మమత



సదాశివపేట మార్చి 8(జనం సాక్షి)
సదాశివపేట పట్టణంలోని శ్రీకృష్ణ నగర్ కాలనీ శ్రీ పంచముఖ హనుమాన్ మందిర్ ద్వితీయ వార్షికోత్సవ వేడుకల్లో 12వ వార్డ్ కౌన్సిలర్ పులిమామిడి మమత పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వార్డు కౌన్సిలర్ నాగుల మానెమ్మ ,ఆలయ కమిటీ సభ్యులు పూలే మామిడి మమతను శాలువతో ఘనంగా సన్మానించారు. ఆమె మాట్లాడుతూ శ్రీ పంచముఖ హనుమాన్ ఆంజనేయస్వామి ఆశీస్సులతో పట్టణ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. భక్తి భావంతో నిర్వహిస్తున్న వార్షికోత్సవ వేడుకలు ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. అనంతరం కౌన్సిలర్ పాత దొడ్డి అనిత విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు నాగరాజ్,సభ్యులు రాములు,రవి,శ్రీనివాస్,నందు, బాలయ్య,నరేష్,మనోజ్, మాధవి, అఖిల్,సోమ్ శంకర్,భక్తులు,కాలనీ వాసులు పాల్గొన్నారు.

# మహిళలు స్వయం ఉపాధిలో రాణించాలి

**ఘనంగా పాలెంలో ప్రాంతీయ మహిళా రైతు సదస్సు**

**జిల్లాలో అభ్యుదయ మహిళా రైతులకు శాలువలతో ఘన సన్మానం**

**సౌత్ తెలంగాణ జోన్ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ఎల్. కృష్ణ**

నాగర్ కర్నూల్, మార్చి 8 (జనంసాక్షి):
బిజినేపల్లి మండలం పరిధిలోని పాలెం పరిశోధన స్థానంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దక్షిణ తెలంగాణ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎల్.కృష్ణ ప్రాంతీయ రైతు సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి సమాజంలో మహిళలు సాధికారత దిశలో వెళ్ళుటకు, కుటుంబంలో స్వయం ఉపాధిగా తప్పనిసరిగా ముందుండాలని ఆయన కోరారు. గ్రామస్థాయి నుండి అంతరిక్షం వరకు మహిళలు సాధికార పొందినప్పుడే సామాజిక అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. మహిళా రైతులను ఉద్దేశించి వివిధ పంటల రకాలు మరియు నూతన సాంకేతికత పద్ధతుల మీద ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగింది. రైతులకు ప్రస్తుత పంటల మీద, అధునాతన పద్ధతుల మీద అవగాహన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేయడం చేశారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పద్మశ్రీ, వేరుశనగ పంటలో చేపట్టవలసిన సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శంకర్ వివిధ యాసంగి పంటలలో చీడపీడల నివారణ గురించి తెలిపారు.

తదనంతరం, రైతులు మరియు శాస్త్రవేత్తల చర్చా గోష్టి నిర్వహించడం జరిగింది. ఇందులో రైతుల సమస్యలకు శాస్త్రవేత్తలు తగిన సూచనలు ఇవ్వడం జరిగింది. సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్ కృష్ణ మాట్లాడుతూ, ప్రస్తుతం వ్యవసాయం లో మహిళా రైతుల పాత్ర గురించి వివరించారు. అదే విధంగా వ్యవసాయంలోకి మహిళలు మరియు యువత ఎక్కువగా రావాలని అలాగే వ్యవసాయమే గాక మహిళా రైతులు స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడి పాడిపరిశ్రమ, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, సేంద్రియ వ్యవసాయం మరియు యాంత్రీకరణ ను ప్రోత్సహించడం వల్ల రైతులకు అధిక రాబడి వచ్చే అవకాశం ఉంటుందని




మరియు కూలీల కొరతను కూడా తగ్గించుకోవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ విద్యార్థులు సాంస్కృతిక కార్య క్రమాలు ప్రదర్శించడం జరిగింది. చివరగా ఉత్తమ మహిళా రైతులను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వారు సత్కరించడం జరిగింది. అనంతరం సామూహిక భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ జి.ఈశ్వర్ రెడ్డి, డాక్టర్ కె సదయ్య, డాక్టర్ శ్రీరామ్, కె.వి.కె,రావేప్, వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 300 మంది రైతులు తదితరులు పాల్గొన్నారు.



## పేదోడి కల... ఇందిరమ్మ ఇల్లు

**- మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్**

పెబ్బేరు మార్చి 8 (జనం సాక్షి) : పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం స్థానిక 10 వార్డులోని తెలుగు ఎల్లమ్మకు మంజూరైన 'ఇందిరమ్మ ఇంటి' నిర్మాణానికి చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై, వేద మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. పేదోడి కల ఇందిరమ్మ ఇళ్లు అని అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసార్ ధర్మ తేజ కౌన్సిలర్ మంగరాయి మన్యం, కాలనీవాసులు కురుమూర్తి, రఘు, రవి, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

## వట్టెం గ్రామంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవలు



నాగర్ కర్నూల్, మార్చి 8 (జనంసాక్షి) : బిజినపల్లి మండలం వట్టెం గ్రామంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రత్యేక వేసవి కాల శిబిరం మూడవ రోజు కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగాయి. మండల పరిధిలోని పాలెం శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల(అటానమస్) ఎన్ఎస్ఎస్ యూనిట్--1, యూనిట్--2 ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలను ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డా.సి.నాగరాజు, శివ దొడ్ల పర్యవేక్షణలో విద్యార్థులు పాల్గొన్నారు. శిబిరంలో భాగంగా వట్టెం గ్రామంలోని చెరువు కట్ట వద్ద కంప చెట్లను, ముళ్ళపొదలను ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తొలగించారు. చెరువు పరిసరాలను శుభ్రంగా ఉంచడం, నీటి నిల్వలకు ఆటంకం కలిగించే చెట్లను తొలగించడం ద్వారా గ్రామ పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు తమ వంతు సేవలను అందించారు. విద్యార్థులు సమిష్టిగా పనిచేస్తూ గ్రామ ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పి.జ్యోతి శంకర్, ఉపసర్పంచ్ వి. వినీత్ గౌడ్ కార్యక్రమానికి హాజరై విద్యార్థులను అభినందిం చారు. యువత సమాజ సేవలో భాగస్వాములు కావడం చాలా సంతోషకరమని, ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థుల్లో సేవతత్వం సాంజిక బాధ్యత పెంపొందుతుందని వారు పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి విద్యార్థులు చేస్తున్న సేవలు ప్రశంసనీయం అని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు మాట్లాడుతూ, విద్యార్థులు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సామాజిక బాధ్యతను తెలుసుకుంటారని చెప్పారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ ఎస్ ఎస్ చైర్మన్ డా.పి రాములు అధ్యాపకులు యాదగిరి, మనోజ్ కుమార్, గ్రామ పెద్దలు, గ్రామ వార్డు మెంబర్లు, గ్రామ యువత పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన సీపీఐ నాయకులు

చేర్యాల (జనంసాక్షి) మార్చి 08 : సీపీఐ చేర్యాల మండల కార్యవర్గ సభ్యులు నంగి సత్తయ్య కుమార్తె లక్ష్మి-రాజ్ కుమార్ ల వివాహా వేడుకలు చేర్యాల మండల కేంద్రంలోని శ్రీ వీరభద్ర ఫంక్షన్ హాల్ లో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు సీపీఐ నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, కత్తుల భాస్కర్ రెడ్డి, జంగిలి యాదగిరి, కోశాధికారి నంగి కనకయ్య, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు పొన్నబోయిన మమత, సుంకోజు రజిత, గూడెపు సుదర్శన్, ఎగుర్ల ఎల్లయ్య, గూడెపు పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.



# పశ్చిమ ఆసియా యుద్ధంలో ప్రధాని మోదీ దౌత్యం భేష్

## కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది నందు నామాజీ



నారాయణపేట మార్చి 8 (జనం సాక్షి): పశ్చిమ ఆసియా లో జరుగుతున్న యుద్ధంలో కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్రమోడీ తీసుకున్న దౌత్యం భేష్ అని కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది నందు నామాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత ప్రభుత్వం దౌత్యం అంతర్జాతీయంగా ప్రత్యేక గుర్తింపును దక్కించుకుందని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆందోళనలు రేకెత్తిస్తున్న సమయంలో కేవలం 48 గంటల వ్యవధిలోనే ప్రధాని జరిపిన ఉన్నత స్థాయి చర్చలు భారతదేశం పెరుగుతున్న గ్లోబల్ ప్రాధా న్యాన్ని ప్రతిబింబించిందన్నారు. సార్వభౌమ దేశాలపై దాడులు సరికాదని ప్రపంచ శాంతి స్థిరత్వం కోసం భారత్ కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్రమోడీ ప్రపంచానికి చాటారని తెలిపారు. అది బాధ్యతాయుత నాయకత్వానికి నిదర్శనమని అన్నారు. భారత పౌరుల రక్షణ కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారని తెలిపారు. చమురు ధరల నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటూ ప్రపంచంలో బాధ్యతాయుతమైన దేశంగా భారత్‌ను నిలిపారని అన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మండలాల కమిటీ ఏర్పాటుకు షెడ్యూల్డ్ ఖరార్

**పాల్గొననున్న వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి**

**డీసీసీ అధ్యక్షులు శివసేనరెడ్డి**

**రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి**



వనపర్తి బ్యూరో మార్చి8 జనం సాక్షి
వనపర్తి నియోజకవర్గంలో ని మండలాల కాంగ్రెస్ పార్టీ కమిటీలను ఈ నెల9 నుంచి,ఎన్నుకున్నారు. ఈ సమావేశాలకు వనపర్తి ఎమ్మెల్యే తుడిమేగారెడ్డి, డిసిసిబి చైర్మన్ కొత్త కాపు శివసేనారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి చిన్నారెడ్డిలు, పాల్గొననున్నారు. ఈనెల 9వ సోమవారం శ్రీరంగపురం,పెబ్బేరు మండలం,,పెబ్బేరు పట్టణ కాంగ్రెస్ పార్టీ కమిటీనీ ఎన్నుకున్నారు. 10వ తేదీన ఖిల్లా ఘణపురం,పెద్ద మందడి మండలాల కమిటీని ఎన్నుకున్నారు. ఈనెల 11న బుధవారం రేవల్లి,ఎదుల, గోపాల్ పెట్ మండలాల కమిటీని ఎన్నుకుంటారు. 12న వనపర్తి, వనపర్తి పట్టణ కమిటీని ఎన్నుకుంటారు. ఈ కార్యక్రమానికి ఆయా మండలాల,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,పార్టీ పెద్దలు, యువకులు, మహిళలు, వనపర్తి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, వనపర్తి, పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డు అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సర్పంచులు, ఉప సర్పంచ్‌లు మున్సిపల్ మాజీ చైర్మన్, మాజీ వైస్ చైర్మన్‌లు, మాజీ కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ సభ్యురాలు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటీసీలు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ అనుబంధ సంఘాల నాయకులు, రైతు అనుబంధ సంఘాల నాయకులు, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హాజరవ్వాల్సిందిగా ఒక ప్రకటనలో కోరారు.

## అమృత్‌లో భాగంగా పైప్ లైన్ పనులు ప్రారంభం



మక్తల్, మార్చి 08 (జనంసాక్షి)
మక్తల్ మున్సిపాలిటీ 16వ వార్డులో అమృత స్కీం లో భాగంగా పైప్లైన్ పనులను స్థానిక వాడు కౌన్సిలర్ అల్కోరి పావని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటికే మిషన్ భగీరథ పైప్లైన్ పనులు పెద్ద ఎత్తున 16 వార్డులో ప్రారంభమయ్యాయని, తాజాగా అమృత్ స్కీం లో భాగంగా పైప్లైన్ పనులను వాటర్ ట్యాంక్ ల నుంచి నేరుగా కలిపే విధంగా చర్యలు చేపట్టామని అన్నారు. రాబోయే రోజుల్లో మంత్రి వాకిటి శ్రీహరి నేరుగా సంగంబండ రిజర్వాయర్ నుంచి మక్తల్ పట్టణానికి తాగునీటిని తీసుకువచ్చి ఇక్కడ ప్రజల దాహార్తిని తీర్చేందుకు చర్యలు చేపడుతున్నారని, ఇందులో భాగంగా ముందస్తుగా నేరుగా ట్యాంకుల నుంచి పైపుల అనుసంధానం పూర్తి చేసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ అల్కారి రవికుమార్, వల్లంపల్లి లక్ష్మణ్, మార్కెట్ డైరెక్టర్ శాలం బిన్ ఉమర్, వల్లంపల్లి గురురాజ్, ప్రవీణ్ కుమార్, ఆనంపల్లి రమేష్, వినయ్ కుమార్, వాలుద్దీన్, బాసి త్, గఫర్, కిరణ్, అక్కల రాకేష్ కుమార్, మందిపాల్ సతీష్, రాము, కడేచూర్ రాజేష్ కుమార్, అజీజ్, రాజశేఖర్, అరవింద్, కురుమూర్తి స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పదితరగతి విద్యార్థులకు ప్రత్యేక మోటివేషనల్ సెషన్

**డిఈఓ గోవిందరాజు**

నారాయణపేట మార్చి 8(జనం సాక్షి): రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన,ఉత్సాహం కలిగించేందుకు ప్రత్యేక మోటివేషనల్ గైడెన్స్ సెషన్ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి గోవిందరాజు తెలిపారు. ఈ కార్యక్రమం మార్చి 9 సోమవారం ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 12:30 వరకు టిబి షాట్, యూట్యూబ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం కానుందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా పాల్గొని విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో, ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో, విజయాన్ని ఎలా సాధించాలో మార్గ నిర్దేశం చేయనున్నారనీ తెలిపారు. అలాగే విద్యార్థులకు కార్య దర్శితో ముఖాముఖి సంభాషించే అవకాశం కూడా కల్పించ బడుతుందనీ తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమా న్యాల పాఠశాలలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు తప్పనిసరిగా ఈ కార్యక్రమాన్ని వీక్షించేలా ఆయా పాఠశాలల ప్రధానోపా ధ్యాయులు తగు ఏర్పాట్లు చేయాలని డీఈఓ సూచించా రు. అలాగే అందరూ మండల విద్యాధికారులు తమ మండల పరిధిలోని ప్రతి పాఠశాలలో ఈ కార్యక్రమం సజావుగా నిర్వహించబడేలా పర్యవేక్షణ చేయాలని కోరారు.

## అదనపు కట్నం వేదింపులతో వివాహిత ఆత్మహత్య

రాజాపూర్, మార్చి 8(జనంసాక్షి) : రాజాపూర్ మండల పరిధిలోని కల్లేపల్లి గ్రామానికి చెందిన మిద్దె అనూష భర్త మిద్దె మహేష్ వేరే మహిళాతో అక్రమ సంబంధం పెట్టుకొని, అదనపు కట్నం కోసం వేదించడంతో తన కూతురు అనూష మనస్తాపానికి గురై శనివారం సాయంత్రం ఇంట్లో చీరతో ఉరి వేసుకొని చనిపోయిందని, తన కూతురు మృతికి కారణమైన భర్త మహేష్ పై చర్యలు తీసుకోవాలని అనూష తల్లి యాదమ్మ ఇచ్చిన పిర్యాదు తో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

# సేవాతత్పరతకు నిలువుటద్దం... ఆర్యవైశ్యులు


**ఘనంగా మక్తల్ వాసవి క్లబ్, వనిత క్లబ్ ప్రమాణ స్వీకారోత్సవం**
**సేవ చేసి తపన, సేవలందించాలన్న తాపత్రయం**
**వాసవి క్లబ్ అధ్యక్షుడిగా హరికృష్ణ, వనితా క్లబ్ అధ్యక్షురాలిగా ప్రసన్న ప్రమాణం**



మక్తల్, మార్చి 08 (జనంసాక్షి) ప్రపంచంలో సేవను మించిన గొప్ప కార్యక్రమం మరొకటి ఉండదని, అలాంటివి తోటి వారికి సేవ చేయడంలో ఆర్యవైశ్యులు ఎప్పుడూ ముందంజలో ఉంటారని ముఖ్య అతిథి, వాసవి క్లబ్ సిల్వర్ కే సి జి ఎఫ్ పాండురంగయ్య గుప్తా అన్నారు. మక్తల్ పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటైన వాసవి క్లబ్ వనితా క్లబ్ ల ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వాసవి మాత చిత్రపటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం నూతన వాసవి క్లబ్ అధ్యక్షునిగా మేడిశెట్టి హరికృష్ణ, సెక్రటరీగా నరహరి తిరుపాల్ శెట్టి, కోశాధికారిగా తాళంపల్లి పవన్, వనితా క్లబ్ అధ్యక్షురాలిగా కల్వల ప్రసన్న, సెక్రటరీగా కౌకుంట్ల నందిని, కోశాధికారిగా తాళంపల్లి రవళి ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పలువురు వారికి శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల విశిష్టత గురించి వివరించారు. సేవ చేయడంలో ఆర్యవైశ్యులు ముందంజలో ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోనే కాకుండా జాతీయవ్యాప్తంగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ లో మహబూబ్‌నగర్ జిల్లా ముందంజలో ఉందని, మక్తల్ క్లబ్ సైతం మంచి పేరు ప్రఖ్యాతలు ఉన్నాయని, ఇలానే ఎక్కువ సేవా కార్యక్రమాలు చేసి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. అనంతరం వాసవి క్లబ్ డిస్టిక్ జాయింట్ సెక్రటరీగా మనసాని నాగరాజును ఎంపిక చేసి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్, కే సి జి ఎఫ్ కల్మిచర్ల రమేష్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు సూర్య ప్రకాష్ రావు, వాసవి క్లబ్ డైమండ్ కేసీజీఎఫ్ రాయచూరు వాసి బిలకంటి జగదీష్ గుప్తా, విన్ కేసీజీఎఫ్ వలకొండ చంద్రశేఖర్, జోన్ చైర్ పర్సన్ బెండే సత్యవతి, వాసవి క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్ వట్ట రతన్ కుమార్ గుప్తా, వనిత క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్ మనసాని దేవి పద్మావతి, కట్ట సురేష్, బి. భాస్కర్, కల్వా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల సమస్యలను అరికట్టాలి

**- క్రీడల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేసిన గాధిర్యాల్ సర్పంచ్ టి మాణిక్యమ్మ**



మహమ్మదాబాద్,మార్చి 8 జనం సాక్షి : అంతర్జాతీయ మహిళల దినోత్సవం పురస్కరించుకొని, మహిళలకు శుభాకాంక్షలు తెలియజేసిన సర్పంచ్ మాణిక్యమ్మ, మహమ్మదాబాద్ మండల పరిధిలోని గాధిర్యాల్, అముదలగడ్డ తండా,ఆయా గ్రామాలలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా,గాధిర్యాల్ గ్రామంలో తోటి మహిళలకు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొని, ఆటల పోటీలు నిర్వహించారు. ఈపోటీలలో పాల్గొని గెలుపొందిన మహిళలకు గ్రామ సర్పంచ్ టి మాణిక్యమ్మ బహుమతులు అందజేశారు. మహిళా సంఘం సభ్యులు,గ్రామ మహిళలు అంగన్వాడి టీచర్,ఆశ వర్కర్లు, ఆముదాలగడ్డ తండా సర్పంచ్ రామ్ చందర్,పంచాయతీ కార్యదర్శిలు హాజీ, వెంకట్రాములు,కారబర్ లాలు,బాలరాజ్ పాల్గొన్నారు.

## 5వ వార్డులో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక

చేర్యాల మార్చి 08, (జనంసాక్షి) : ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేర్యాల మున్సిపాలిటీలోని 5వ వార్డును చేర్యాల మున్సిపల్ కమిషనర్ నాగేందర్ మున్సిపల్ సిబ్బంది ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా 5వ వార్డు కౌన్సిలర్ వెలుగల దుర్గయ్య వార్డులో ఉన్న పలు సమస్యలను వారికి వివరించారు. మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్, వార్డు ఇన్‌చార్జ్ రమేష్, వెలుగుల బాలనర్సయ్య, సిద్దులు, బాలకృష్ణ, సంతోష్, పుల్ల ఐలయ్య, లింగం తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ప్రారంభం




జడ్చర్ల, మార్చి 8 (జనంసాక్షి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జడ్చర్ల ఏరియా ఆసుపత్రిలో ఆదివారం హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ పుష్పలత, మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి రెడ్డి ఘనంగా ప్రారంభించారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు 14 ఏళ్ల లోపు బాలికలందరికీ ఈ టీకా ఎంతో అవసరమని, మొదటి రోజే 35 మందికి టీకాలు వేసినట్లు తెలిపారు. టీకాను ప్రతిరోజూ ఉదయం 9:00 నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు (ఆదివారాలు, సెలవు దినాలు మినహా) ఏరియా ఆసుపత్రిలో అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సారిక, కౌన్సిలర్ సతీష్, గోవర్ధని, డాక్టర్లు మనుప్రియ, హర్షదుల్లా, సునీల్, శివకాంత్ పాల్గొన్నారు.

## వార్డు సభ్యులకు శిక్షణ ముగింపు

ఐజ జనం సాక్షి: అయిజ మండలంలో కొత్తగా ఎన్నికైన వార్డు సభ్యులకు గ్రామాభివృద్ధి పనుల అవగాహన కోసం 5 రోజుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆదివారం చివరి రోజున, మండల ఎంపీడీవో భాస్కర్ యా దవ్, చిన్న భీముడు, వెంకటాపురం పంచాయతీ కార్య దర్శి స్వాతి చేతుల మీదుగా వెంకటాపురం వార్డు సభ్య లకు సర్టిఫికెట్లు అంద జేశారు. వార్డు సభ్యులం దరూ ప్రజాసేవలో తమ వంతు పాత్ర పోషించి, ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులు సూచించారు.





## ముగిసిన వార్డు సభ్యుల శిక్షణ

మల్దకల్ మార్చి9(జనంసాక్షి) మండల కేంద్రంలోని ఐదు రోజులపాటు రైతు వేదిక, మండల మహిళా సమాఖ్య భవనంలో జరిగిన గ్రామపంచాయతీ వార్డు సభ్యుల ఓరియంటేషన్ ప్రోగ్రాం మూడు సెంటర్లలో నిర్వహించారు. 5 రోజుల ట్రైనింగ్ లో భాగంగా చివరి రోజు ఆదివారంఅన్ని గ్రామపంచాయతీ నుంచి వార్డు మెంబర్లు పాల్గొన్నారు. అందరూ వార్డు మెంబర్లకు ఐదు రోజులు ట్రైనింగ్ లో పాల్గొన్నందుకు సర్టిఫికేట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయరెడ్డి, ఎంపీఓజాకీర్,సూపర్డెంట్ పెద్ద నర్సన్న,సీనియర్ అసిస్టెంట్ సూర్య ప్రకాష్ రెడ్డి,టైపిస్ట్ రెహ్మాన్,ట్రైనింగ్ ఆఫీసర్లు ధనుంజయ రెడ్డి,మస్తాన్,వినయ్ కుమార్ రెడ్డి,రమేశ్,రాఘవేంద్ర, శివన్న,నాగరాజ్ గౌడ్, హరి కుమార్,మహేశ్వర్,గంగాధర్, పురుషోత్తం,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రాఘవరెడ్డి సహకారంతో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం



వెల్దండ మార్చి 08 (జనంసాక్షి) : గ్రామీణ ప్రాంతాల పేదల ఆరోగ్యం కోసమే ఉచిత వైద్య శిబిరం నిర్వహించామని వార్డు సభ్యులు గోపిరెడ్డి రాఘవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని చొక్కన్నపల్లి గ్రామంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాఘవరెడ్డి సహకారంతో డాక్టర్ శిరీష, ల్యాబ్ టెక్నీషియన్ కిరణ్ సుమారు 80 మందికి పైగా బిపి, షుగర్, థైరాయిడ్ టెస్టులు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం, అజాగ్రత్త వహిస్తారని వారికి అవగాహన కల్పించేందుకు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించామని తెలిపారు. మాజీ ఎంపీటీసీ జంగయ్య యాదవ్, నాయకులు శశిధర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, చల్ల వెంకట్ రెడ్డి, లక్ష్మారెడ్డి, ద్యాప వెంకట్ రెడ్డి, నారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అచ్చంపేట పట్టణంలో బాలికపై వీధి కుక్కల దాడి



అచ్చంపేట మార్చి 8 (జనం సాక్షి) పట్టణంలోని మున్సిపల్ కార్యాలయానికి కూత వేటు దూరంలో జూబ్లీ నగర్‌లో నివసిస్తున్న అక్షయ 8 సంవత్సరాల బాలికపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. పట్టణంలోని పలు కాలనీలో ఉన్న సమస్యలను పట్టించుకోని మునిసిపల్ అధికారులు. వెంటనే వీధి కుక్కలు, కోతుల బారి నుండి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా కాపాడాలని పట51

## ఫింగర్ ప్రింట్ డివైస్‌తో తనిఖీలు



నారాయణపేట మార్చి 8(జనం సాక్షి): నారాయణపేట రూరల్ పోలీ స్ స్టేషన్ పరిధిలో అప్పక్ పల్లి చౌరస్తాలో ముందస్తు నేరాల నియంత్రణలో భాగంగా దొంగతనాల నివారణనే లక్ష్యంగా, అనుమానిత వ్యక్తులను పాత నేరస్తులను గుర్తించడానికి బ్లూ కోర్ట్స్ పోలీసులు ఆనంద్, రాజు లు ఫింగర్ ప్రింట్స్ డివైస్ తో తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఆదివారం జిల్లా ఎస్పీ వినీత్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను తగిన రీతిలో పరిశీలించి, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఫింగర్ ప్రింట్ డివైస్ తో వ్యక్తుల వేలి ముద్రలు సేకరించి క్రిమినల్ రికార్డులతో సరి పోల్చారు. పౌరులు ఎటువంటి అను మానాస్పద వ్యక్తులు గమనించిన వెంటనే లోకల్ పోలీసులకు లేదా డయల్ 100 కి సమాచారం ఇవ్వా లని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# వంట గ్యాస్ ధరలు పెంచి మహిళలకు ఇబ్బందులు

**ధరలు పెంచడమే మహిళలకు ఇచ్చే కానుక : సీపీఎం**



గద్వాల టౌన్ మార్చి 8 జనంసాక్షి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వంట గ్యాస్ ధరలు పెంచి మహిళలకు ఇబ్బందులను గురి చేయడమే కేంద్ర ప్రభుత్వం మహిళలకు ఇచ్చే కానుక అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.వంట గ్యాస్ ధరలను పెంచడాన్ని నిరసిస్తూ ఆదివారం జిల్లా కేంద్రంలోని వైయస్సార్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంద ర్భంగా గ్యాస్ ధరలను పెంచి ప్రభుత్వ మహిళలకు పెద్ద కానుకే ఇచ్చిందని ఏద్దేవా చేశారు. మహిళల గురించి గొప్పలు మాట్లాడి వారిని మాత్రం వంట గదికి పరిమితం చేయడంలో మనువదా బిజెపి ముందంజలో ఉందన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వంట గ్యాస్,పెట్రోల్, డీజిల్ ధరలు నిరంతరాయంగా పెంచుతున్నదని విమర్శించారు.ప్రజలకు ఉపాధి లేకుండా చేసి వారు ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే ప్రభుత్వం మాత్రం నిరంతరం వస్తు సేవల ధరలను పెంచుతూ అర కోర ఆదాయాలకు సైతం కోతలు పెడుతున్నదని విమర్శించారు.రష్యా నుండి చమురు కొనుగోలు చేయడానికి అమెరికా అనుమతి దేనికని ప్రశ్నించారు.సామ్రాజ్యవాద దేశాలకు భయపడి దేశ సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టుపెట్టడం ఏమిటని ప్రశ్నించారు. సామ్రాజ్యవాద దురహంకారంతో అమెరికా ఇజ్రాయిల్ దేశాలు కలిసి ఇరాన్ పై చేస్తున్న దాడుల వల్లే ధరలు పెరుగుతున్నాయని తెలిపారు. యుద్ధం ఇంకా కొనసాగితే భారతదేశం సైతం తీవ్ర ఆర్థిక మాంద్యానికి ఎదురవుతుందని హెచ్చరించారు. తక్షణమే ఇరాన్ పై దాడులను ఆపి శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో దీర్ఘకాల ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేర్ నరసింహ,కార్మికులు లక్ష్మన్న, నరేష్, గజేంద్ర,ఎలప్ప, వీరేష్ పాల్గొన్నారు.



## అడ్డాకుల మండలానికి వ్యవసాయ మార్కెట్ యార్డ్ మంజూరు

అడ్డాకుల మార్చ్ 8, (జనం సాక్షి ) మండల కేంద్రానికి డ్రాప్ నోటిఫికేషన్ లో మార్కెట్ యార్డ్ మంజూరైన సందర్భంగా ఆదివారం పత్రికా విలేకరుల సమావేశంలో జిల్లా కిషన్ సేల్ అధ్యక్షులు కందూరు నాగిరెడ్డి తెలిపారు. గతంలో మండల శివారులో గల 161 సర్వే నెంబర్ లో పలుగు గుట్ట దగ్గర 6 ఎకరాల 20 గుంటలు స్థల పరిశీలన సేకరించి దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావుకు ప్రపోజల్ పంపించారని, భూత్పూర్, మూసాపేట, అడ్డాకుల మూడు మండలాలకు కలిపి డ్రాప్ నోటిఫికేషన్ లో వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ మంజూరైనందున మండల కాంగ్రెస్ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డికి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావుకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మండల కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దశరథ్ రెడ్డి, విజయ మోహన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జగదీష్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి బాలికకు హెచ్‌పివి వ్యాక్సిన్

**- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

మహబూబ్ నగర్ రూరల్ మార్చి 08(జనం సాక్షి ):అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 14 సంవత్సరాలు పూర్తై 15 సంవత్సరాలు పూర్తి కాని బాలికలకు హ్యూమన్ ప్యాపిలోమా వైరస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిలి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 14 సంవత్సరాలు నిండిన ప్రతి బాలికకు హ్యూమన్ ప్యాపిలోమా వైరస్ వ్యాక్సినేషన్యాక్సిన్ వేయించడం ఎంతో అవసరమని, ఇది భవిష్యత్తులో వచ్చే గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధులను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ కుమార్తెలకు ఈ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించేందుకు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్ , జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. కృష్ణ, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి =మీా డా. గణేష్, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, ౹ూా–జ౧× డా. విద్య, డా. రాజు, స్థానిక వైద్యాధికారులు డా. రాఘవేందర్, డా. రమ్యతో పాటు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రమాదాలకు నిలయాలుగా రహదారులు

**- ప్రాణాలతో చెలగాటమాడుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు**



ఊర్కొండ మార్చి 08 (జనం సాక్షి)

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల ప్రధాన రహదారులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయని వాహనదారులు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిపై రోడ్డు కొట్టుకుపోయి ఏర్పడిన పెద్ద గుంతల వల్ల రాత్రి వేళల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పెద్ద వాహనాలకు సైడ్ ఇచ్చే క్రమంలో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రాణ నష్టం జరగకముందే ఆర్ అండ్ బి అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి రహదారి మరమ్మ తులు చేపట్టాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**ప్రమాదకరంగా జకినాలపల్లి - ఊరుకొండపేట రోడ్డు**

హైదరాబాదు నుండి మండలంలో ప్రసిద్ధిగాంచిన ఉరుకొండ పేట శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి దేవాలయ దర్శనానికి వెళ్లే జకినాలపల్లి- ఊరుకొండ పేట గ్రామాల మధ్యలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు కొట్టుకుని పోయి చాలా వరకు దెబ్బతిన్నాయి. ఇంతవరకు అధికారులు పట్టించుకోకపోవడం పట్ల వాహన దారులు స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ఇరుకుగా ఉండటం వల్ల భారీ వాహనాలు వచ్చినప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి.గతంలో రోడ్డు దాటుతున్న క్రమంలో వాహనం ఢీకొని ఓ ఉపాధ్యా యురాలు మృతి చెందింది. అమన్ గల్ నుండి ఊరుకొండ గేటు వరకు హైదరాబాదు నుండి బస్సు సౌకర్యం ఉండటం నిత్యం ప్రజలు వాహనదారులు రద్దీగా ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

**బస్ స్టాప్ - డివైడర్ లేక నిత్యం ప్రమాదాలు**



మండల కేంద్రంలోని కోదాడ - జడ్చర్ల జాతీయ రహదారిపై ప్రయాణికుల అవసర నిమిత్తం బస్ స్టాప్ లేకపోవడంతో ప్రయాణికులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. బస్సు సమయానికి రానప్పుడు ప్రయాణికులు కూర్చోవడానికి బస్ స్టాప్ లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. కొత్త మండలం అయినప్పటికీ ఏ ప్రజాప్రతినిధి కూడా బస్టాప్ పై దృష్టి సారించలేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాప్ లేకపోవడంతో ప్రయాణికులు అటు ఇటు వెళ్లినప్పుడు రహదారిపై వేగంగా వెళుతున్న వాహనాలు ఢీకొని చనిపోయిన , గాయపడిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. గతంలో ఆటో - లారీ ఢీకొన్న సంఘటనలో పలువురు ప్రయాణికులు చనిపోయరు. నిత్యం రద్దీగా ఉన్న జాతీయ రహదారిపై ఎక్కడో ఒకచోట ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మహబూబ్నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ, స్థానిక ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మండల కేంద్రంలో బస్సు షెల్టర్ నిర్మాణం జాతీయ రహదారిపై డివైడర్ ఏర్పాటుకు కృషి చేయాలని మండల ప్రజలు వాహనదారులు కోరుతున్నారు.

# పరిసరాలను శుభ్రతగా ఉంచుకోవాలి

**కాంగ్రెస్ పార్టీ నాయకులు జయాకర్**



ఖిల్లా ఘనపురం, 8 మార్చ్, (జనం సాక్షి) :
ఖిల్లా ఘనపురం

మండల పరిధిలో ని ఆగారం గ్రామంలో ఆదివారం ప్రజా పాలన ప్రగతికి ప్రణాళిక కార్యక్రమన్ని కాంగ్రెస్ మండల నాయకులు జయాకర్ స్థానిక నాయకులతో కలసి ఘనంగా నిర్వహించడం జరిగింది. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం పరిసర ప్రాంతాలలో చెత్త చెదారం లేకుండా చూడాలని గ్రామ పరిశుభ్రంగా ఉండటంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని నాయకులు జయాకర్ తెలిపారు, అనంతరం స్థానికులతో కాలసి చెత్తను జాడులతో ఊడిచి రోడ్ల ఇరువైపులా శుభ్రం చేశారు గ్రామంలో ఎక్కడ కూడా ఇష్టనుసారంగా చెత్తను వెయ్యకూడదని చెత్త కుండీలను వినియోగించుకోలని గ్రామ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంటే డెంగ్యూ,మలేరియా ఎలాంటి విష జ్వరాలు,రావని ఈ సందర్భంగా జయాకర్ గ్రమస్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మున్నూరు జయాకర్ గ్రామ సర్పంచ్ నర్సమ్మ, ఉపసర్పంచ్ మున్నూరు రవి కుమార్, గ్రామ కార్యదర్శి రవి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సత్య రెడ్డి, వార్డు సభ్యులు రాంచంద్రమ్మ, పద్మమ్మ, అరుణ, కాంగ్రెస్ నాయకులు నరేష్, కృష్ణయ్య, ఖాదర్, బాబు కుమార్ పాల్గొన్నారు.

# "హ్యాపీ సండే"






మహబూబ్ నగర్ అర్బన్ మార్చి 08(జనం సాక్షి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 6 నుండి 9 గంటల వరకు "హ్యాపీ సండే" కార్యక్రమాన్ని మహబూబ్ నగర్ స్టేడియం కమాన్ – కొత్త బస్టాండ్ ప్రధాన రోడ్డు కూడలి వద్ద మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రుణమాఫీ, 10 లక్షల ఆరోగ్య బీమా, స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఋణాలు ఇతర సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ తెలంగాణ సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో కళాకారులు ఆట పాటలతో ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిన్నారుల చేత సాంస్కృతిక డాన్స్ కార్యక్రమాలు, ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగా ఇన్స్ట్రక్టర్ల చేత యోగాసనాల కార్యక్రమం నిర్వహించి యోగా చేయడం వల్ల వచ్చే ఆరోగ్య ఫలితాలను ప్రజలకు వివరించారు. అలాగే లాఫింగ్ థెరపీ నిర్వహించి నవ్వడం వల్ల మనిషికి రోజువారి పని వత్తిడి నుండి మానసిక ఉల్లాసం కలిగి ఆరోగ్యంగా ఉంటారని నిర్వాహకులు వివరించారు. సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు కూడా ఉత్సాహంగా ఆటలు ఆడి పాటలు పాడి వారి అనుభవాలను పంచుకున్నారు.

ఈ కార్యక్రమంలో స్వయం సంఘాల సభ్యుల ద్వారా స్టాళ్లను ఏర్పాటు చేసి వారు తయారుచేసిన పౌష్టిక ఆహార పదార్థాలను, ఇతర వస్తువులను ప్రదర్శించారు.

ఈ కార్యక్రమంలో మేయర్ జి. మమత, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఉమర్ కొత్వాల్, సీనియర్ సిటిజన్ ఫోరం సంఘం సభ్యులు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచిన పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

చేర్యాల (జనంసాక్షి) మార్చి 08 :చేర్యాల మండలం తాడూరు గ్రామ నిరుపేద కుటుంబానికి చెందిన నూకల దేవేందర్ యాదవ్ కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్నారు. వీరి కుమార్తె అనూష కాలు ఆపరేషన్ కోసం పెద్ద మొత్తంలో డబ్బులు అవసరం కాగా ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్‌కు సమాచారం అందిన వెంటనే వారు పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణమే స్పందించిన పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ రూ. 1,25,000 ఎల్ఓసీ(సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరు చేయించడం జరిగింది. మంజూరు పత్రాన్ని నాగపురి కిరణ్ కుమార్ ఆదివారం రోజు అనూష కి అందజేశారు. ఈ సందర్భంగా బాధ్యత కుటుంబం, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కిరణ్ కుమార్, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు ఈరు రామలింగం, నూకల దేవేందర్, నూకల విజయ్, నూకల స్వామి, మరబోయిన స్వామి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## బావిలో పడి విద్యార్థి మృతి





మల్దకల్ మార్చి 8(జనంసాక్షి) మండల పరిధిలోని అమరవాయి గ్రామానికి చెందిన వెంకటన్న శంకరమ్మ తల్లిదండ్రులు చిన్న కుమారుడు జయరాజు (13)అనే బాలుడు స్నేహితులతో కలసి ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో మునిగి గల్లంతైయ్యాడు. ఈసంఘటన స్థలానికి పోలీస్ సిబ్బంది చేరుకుని గల్లంతైన బాలుడు ఆచూకీ కోసం ఫైర్ సిబ్బంది సహాయంతో బావిలోని నీటిని బయటకు తీసి దాదాపు రెండు గంటలసేపు గాలింపు చర్యలు చేపట్టిన ఫలితం లేకపోవడంతో చివరకు గ్రామస్తులు,గజఈతగాళ్లు కలిసి బాలుడు మృతదేహాన్ని వెలికి తీశారు.కుటుంబ సభ్యుల రోదనాలు మిన్నంటాయి.శవాన్నిగద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించగా హెడ్ కానిస్టేబుల్ గోపాల్ నాయక్ కేసు నమోదు చేసుకొనిదర్యాప్తు చేసినట్లు ఆయన తెలిపారు.బాలుడు జయరాజు గద్వాల ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు.గ్రామ సర్పంచ్ తూమ్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపిటిసి గోపాల్ రెడ్డి బాలుడు కుటుంబాన్ని పరామర్శించారు. వేసవికాలంలో పిల్లలు కుంటలు,బావుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

## వృధాగా పోతున్న మిషన్ భగీరథ నీరు



అల్లాదుర్గం మార్చి 8 (జనంసాక్షి)

అల్లాదుర్గం మండలంలోని గడిపెద్ధపూర్ వద్ద మిషన్ భగీరథ పైప్ నుండి నీరు రోడ్డుపై పారుతు నీరు చాలా వృధా అవుతున్నది . గడి పెద్దపూర్ స్టేజి సర్వీస్ రోడ్డు నుండి దాధాయి పల్లి వెళ్ళే రోడ్డు పై నీరు నిలిచిపోయింది.

నీరు రోడ్డుపై వృధాగా పోకుండా సంబధిత అధికారులు వెంటనే స్పందించి తాగు నీటివృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## మహిళా దినోత్సవం రోజునైనా మహిళలను గౌరవిద్దాం

రాజాపూర్, మార్చి 8(జనంసాక్షి) : మార్చి 8 ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా చాలా మంది ప్రజాప్రతినిధులు మహిళా ప్రజాప్రతినిధులను, పారిశుద్ధ్య కార్మికులను, ఆశా వర్కర్లను, అంగన్ వాడి టీచర్లను శాలువలతో సన్మానించారు. ఆ గౌరవం కొద్ది నిమిషాల్లో నే ముగిసిపోయిందని పలువురు సామాజిక కార్యకర్తలు అంటున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా గ్రామాల్లో పలు విబాగాల్లో , వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి కార్యాక్రమాలు నిర్వహిస్తున్నారు. కానీ ఆ కార్యాక్రమాల్లో ఎక్కడ చూసినా మహిళా దినోత్సవం రోజున పారిశుద్ధ్య కార్మికులైన మహిళలతో పనులు చేయించడం పై పలు విమర్శలు వస్తున్నాయి.



## వాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్

పటాన్చెరు మార్చి 8 (జనం సాక్షి)

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆదివారం నాడు ప్రారంభించిన పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి. 9 సంవత్సరాల నుండి 14 సంవత్సరాలలోపు వయస్సు గల ఆడపిల్లలు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ నాగలక్ష్మి, ఆస్పత్రి సూపరిండెంట్ చంద్రశేఖర్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కంకర శీనయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాయికాడి విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రపంచ మహిళా దినోత్సవం




గద్వాల టౌన్ మార్చి 8 జనంసాక్షి

గద్వాల పట్టణంలోని రైల్వే స్టేషన్ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్నూల్‌కు చెందిన ఐపీఎఫ్ వి. రామ్మోహన్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. ధర్మారావు సిబ్బందితో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళ హెడ్ కానిస్టేబుల్ బి. పారిజాతమ్మ 575ను ఘనంగా సత్కరించారు.మహిళా ప్రయాణికులను గౌరవిస్తూ సన్మానించగా వృద్ధ మహిళలకు శాలువాలతో సత్కరించి ప్రత్యేకంగా అభినందించారు.మార్చి 8 నుంచి 14 వరకు వారంరోజుల పాటు మహిళల భద్రత, గౌరవం, సాధికారతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. మహిళలకు రైల్వే ప్రాంగణాల్లో సురక్షిత వాతావరణం కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని ఆర్‌పీఎఫ్ అధికారులు వెల్లడించారు.

**మల్దకల్ మండల కేంద్రంలో..**

మల్దకల్ మార్చి8(జనంసాక్షి)

మండల కేంద్రంలోని ఆదివారం వ్యవసాయ మహిళ కూలీలు అంతర్జాతీయ మహిళా దినోత్సవం తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. జోగులాంబ గద్వాల జిల్లా తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.పద్మ హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మహిళా కూలీలు తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఇటిక్యాల మండల కోఆర్డినేటర్ వినోద పాల్గొన్నారు.

# పాము కాటుతో మహిళ మృతి

శ్రీరంగాపూర్ మార్చి 8 జనం సాక్షి
శ్రీరంగాపురం మండల కేంద్రానికి చెందిన రేపల్లె పుష్పలత భర్త రాజేందర్ అలియాస్ జగన్ తేదీ 7.03.26 రోజు రాత్రి ఆమె మూత్ర విసర్జనకు కోసం బయటికి వెళ్ళగా కాసేపటికి ఇంటి ముందు కూర్చొని ఏడుస్తూ ఉండగా ఆమె భర్త రాజేందర్, మామా నాగన్నలు ఆమె దగ్గరికి వెళ్లి ఏమి జరిగిందని అడగగా నాకు ఏదోలా ఉందని చెప్పింది. కాసేపటికి నోటి నుంచి నురగ రాగా ఏదైనా విషపూరితమైన పాము కరిచి ఉండవచ్చు అని అనుమానంతో వెంటనే చికిత్స కోసం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా, అదే రోజు రాత్రి 11:50 నిమిషాలకు సమయంలో చనిపోయింది. మృతురాలికి మూడు సంవత్స రాల క్రితం రాజేందర్ తో వివాహం జరిగి ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు కూడా కలరు. మృతురాలి తల్లి అయినా కేశపాగ బాలమ్మ ఈరోజు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఏఎస్ఐ మన్యపు రెడ్డి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.



# రామచంద్రాపురంలో ఇఫ్తార్ విందు..



రామచంద్రాపురం,మార్చి 8(జనం సాక్షి)
పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్‌నగర్ మసీదు వద్ద ఆదివారం ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హాజరై మైనారిటీ సోదరులతో కలిసి రంజాన్ మాసం శు భాకాంక్షలు తెలిపారు. మత సామరస్యాన్ని పెంపొందించే ఇటువంటి కార్యక్ర మాలు సమాజంలో ఐక్యతను బలపరుస్తాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు, తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్లు, విద్యుత్‌నగర్ కాలనీ డైరెక్టర్లు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# వనదుర్గమ్మ సన్నిధిలో న్యాయమూర్తి

పాపన్నపేట, మార్చి 8 (జనంసాక్షి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గా భవాని మాతను న్యాయమూర్తి దర్శించుకున్నారు. ఆదివారం అమ్మవారి ని మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి కాసోజు.సురేందర్ దర్శించుకు న్నారు. అర్చకులు శంకర్ శర్మ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. జిల్లా అదనపు పాలనాధికారి మెంచు నగేష్,ఆలయ ఈఓ మరం వీరేశం తదితరులు ఉన్నారు.



# వివాహ వేడుకల్లో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే నారాయణరెడ్డి

వెల్దండ మార్చి 08 (జనంసాక్షి) :
కాంగ్రెస్ పార్టీ వెల్దండ మండల అధ్యక్షులు మోతిలాల్ నాయక్ కూతురు వివాహం ఆదివారం వెల్దండ మండల పరిధిలోని రాఘా యిపల్లి గార్డెన్లో నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి విద్యా కమిటీ సభ్యులు వెంకటేష్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో వెల్దండ కాంగ్రెస్ పార్టీ సీనియర్



నాయకులు మట్ట వెంకటయ్య గౌడ్ పర్వత్ రెడ్డి సురేందర్ రెడ్డి గన్యా నాయక్ శంకర్ నాయక్ కొయ్యల పుల్లయ్య ఎండి రషీద్ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం

## - హాజరైన టిపిసిసి అధికార ప్రతిని కేశం నాగరాజు గౌడ్

అమరచింత జనం సాక్షి
మండలంలోని చింతరెడ్డి పల్లె మీట్ల నందిమల్ల గ్రామాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర పశు సంవర్ధక పాడి పరిశ్రమ క్రీడలు యువజన శాఖ మంత్రి వర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశం అనుసారంగా టిపిసిసి కల్లుగీత డిపార్ట్మెంట్ రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ ఆదివారం నూతన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభోత్సవం చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అమరచింత మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శ్యామ్ కాంగ్రెస్ పార్టీ రమేష్ ముదిరాజ్ జింక రవి సర్వారెడ్డి చుక్క అసిరెడ్డి చింతరెడ్డిపల్లి సర్పంచ్ రామేశ్వరమ్మ వెంకట్ రెడ్డి చుక్క వెంకట్ రెడ్డి చెన్నారెడ్డి మేకల వెంకట్ రెడ్డి ప్రవీణ్ వెంకటయ్య గౌడ్ వెంకట్ రెడ్డి రంగారెడ్డి లక్ష్మారెడ్డి శేఖర్ చింతరెడ్డిపల్లి మిట్ల నందిమల్ల ఈర్లదిన్నె నందిమల్ల ఎక్స్ రోడ్ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సనాతన ధర్మ పరిరక్షణ డివిజన్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

నాగర్ కర్నూల్, మార్చి 8 (జనంసాక్షి): నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో సనాతన ధర్మ పరిరక్షణ అలయన్స్ కమిటీ డివిజన్ స్థాయి కమిటీ ఏకగ్రీవంగా ఎంపికైనట్లు వ్యవస్థాపక యోగ గురువు బీరెల్లి చంద్రారెడ్డి తెలిపారు. నాగర్ కర్నూలు డివిజన్ కమిటీ అధ్యక్షులుగా బాదం నరేందర్, ప్రధాన కార్యదర్శిగా ప్రతాపచారి, కోశాధికారిగా వేదవతి ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా రాము, ప్రశాంత్ రెడ్డి, శోభ, శీను, అనూష ,పద్మ, మహేలింగం, సరస్వతి, అనురాధ, వెంకటేష్ ఉప కార్యదర్శులుగా నాగరాజ్, మురళీమోహన్, శీను, సోషల్ మీడియా బాధ్యులుగా హెచ్. నందకిషోర్ లు ఏకగ్రీవంగా ఎంపికైనట్లు తెలిపారు. ఈ డివిజన్ కమిటీ భవిష్యత్తులో ధర్మ పరిరక్షణ కోసం విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు.

# 'మిలియన్ మార్చ్ డే'ను విజయవంతం చేయాలి

వెల్దండ మార్చి 08 (జనంసాక్షి) : తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీయూ జేఏసీ) ఆధ్వర్యంలో మార్చ్ 10వ తేదీన హైదరాబాద్ లో 'గ్రేట్ తెలంగాణ మిలియన్ మార్చ్ డే' ను నిర్వహించనున్నారు. దీంతో మిలియన్ మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు వెంకటయ్య, సాయిలు, నిరంజన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం వెల్దండ మండల కేంద్రంలో చలో గన్ పార్క్ గోడపత్రికను వారు విడుదల చేశారు. రాష్ట్ర ఉద్యమకారుల ఆకాంక్షలను సాధించుకునేందుకు చేపట్టే ఈ కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్, ఆనంద్ గజిని శ్రీను, వెంకటయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

# రహదారి విస్తరణ పనుల్లో వేగం పెంచండి..

**జాతీయ రహదారి విస్తరణలో నష్టపోయే ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తాం..**

**పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

పటాన్చెరు మార్చి 8 (జనంసాక్షి)
జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బిహెచ్ఎల్ చౌరస్తా నుండి రుద్రారం గ్రామ శివారు వరకు చేపడుతున్న పనుల్లో భూములు, ఇల్లు, దుకాణ సముదాయాలు నష్టపోయే ప్రతి ఒక్కరికి సంపూర్ణ న్యాయం చేస్తామని.. ఈ విషయంలో ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జాతీయ రహదారి విస్తరణ పనుల పై శనివారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారం వార్డు కార్యాలయంలో గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణలో రెండు వైపులా 100 ఫీట్ల పొడువున రహదారి నిర్మాణం చేపడుతున్నారని.. ఇదే విధానం రుద్రారంలో అమలు అయితే ప్రజలు విలువైన ఆస్తులు కోల్పోయే దుర్భర పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రహదారి విస్తరణలో రుద్రారం పరిధిలో మొత్తం 78 ఆస్తులకు విఘాతం కలుగుతోందని తెలిపారు. దీంతో పాటు రహదారి విస్తరణలో ఆస్తులు కోల్పోతున్న బాధితులకు మెరుగైన నష్టపరిహారంతో పాటు.. స్థలాలు కేటాయించాలని కోరారు. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు పరిహారం అందించేందుకు కృషి చేస్తామని జాతీయ రహదారుల సంస్థ ఈఈ ప్రకాష్ తెలిపారు. దీంతో పాటు ఆస్తులు కోల్పోతున్న బాధితులకు గ్రామంలో మరో చోట స్థలాలు కేటాయించేలా ప్రభుత్వానికి విన్నవిస్తామని ఆర్డీవో పాండు తెలిపారు.
ఈ అంశంలో గ్రామస్తులు ఎటువంటి ఆందోళనకు గురికావద్దని ఎమ్మెల్యే జీఎంఆర్ భరోసా అందించారు.



**రహదారి విస్తరణల జాప్యం పైన ఎమ్మెల్యే ఆగ్రహం..**
జాతీయ రహదారి విస్తరణ పనులు ఆశించిన మేరకు జరగడం లేదని.. వివిధ శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపం మూలంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉత్పన్నం అవుతున్నాయని ఎమ్మెల్యే జీఎంఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్దేశించిన గడువు లోగా పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. స్థానిక అధికారుల సహకారం తీసుకోవడంతో పాటు.. ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో పాండు, ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్ సుమలత, జాతీయ రహదారుల సంస్థ ఈఈ ప్రకాష్, డిఈ రామకృష్ణ, విద్యుత్ శాఖ డిఈ భాస్కరరావు, తాసిల్దార్ హరిబాబు, ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట కిషన్, ట్రాఫిక్ సీఐ లాలు నాయక్, రుద్రారం కౌన్సిలర్లు పాండు, మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.